నమస్తే తెలంగాణ | శుక్రవారం 2 మే 2025
FRIDAY, MAY 2, 2025

# అంబేద్కర్ కూడలిలో.. ట్రాఫికర్

**ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటైనా ఫలితం శూన్యం**
**పెరిగిన వాహనాల రద్దీ.. తప్పని పాట్లు**
**రోడ్లపై అడ్డగోలుగా అక్రమ పార్కింగ్‌లు**
**సిగ్నల్ వ్యవస్థలేక కష్టాలు**



ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఇబ్రహీంపట్నం, మే 1 : ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటైతే అక్రమ పార్కింగ్‌లతో పాటు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని భావించిన పట్నం వాసులు, వాహనదారుల కష్టాలు నీటిమీద రాతలుగానే మారాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఒప్పించి ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. కానీ, ట్రాఫిక్ కష్టాలు, అక్రమ పార్కింగ్ సమస్యలు మాత్రం నేటికీ తీరటంలేదని ప్రయాణికులు, దుకాణదారులు, పాదచారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మీదుగా హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారి ఉండటంతో ఇబ్రహీంపట్నం బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ నుంచి శాస్త్రా గార్డెన్ వరకు ప్రధాన రోడ్డువెంట వాహనదారులు ఇష్టారీతిన రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో పెద్ద వాహనాలకు ఇబ్బందులు తప్పటంలేదు. బుధవారం వచ్చిందంటే ట్రాఫిక్ సమస్య ఇంకా తీవ్రమవుతోందని దుకాణదారులు, చిరు వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణాలు సాగించే ఈ రహదారిలో సిగ్నల్ వ్యవస్థలేక ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకూ అధికమవుతున్నది.



సాగర్‌రహదారి వెంట అక్రమంగా వాహనాల పార్కింగ్

**అవగాహనలేమితో ఇబ్బందులు..**

సాగర్‌రహదారికి ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండు ఆనుకుని ఉండటంతో ఈ రోడ్డువెంట ఆర్టీసీ డ్రైవర్లు ఇష్టారీతిన బస్సులు అడ్డదిడ్డంగా నిలిపి ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆర్టీసీ బస్సులకు చెందిన డ్రైవర్లు అవగాహనలేక రోడ్డు మధ్యలో బస్సులను నిలుపుతున్నారు. వీరికి ఆర్టీసీ, ట్రాఫిక్ అధికారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

**చలాన్లపైనే దృష్టి..**

ట్రాఫిక్ సమస్య, అక్రమ పార్కింగ్ వ్యవస్థను నిర్మూలించాల్సిన ట్రాఫిక్ పోలీసులు సాగర్‌రహదారిపై వాహనాలకు చలాన్లు విధించడంపైనే దృష్టి సారిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్యలు పరిష్కరించడంలో పోలీసులు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

**అంబేద్కర్ చౌరస్తాలో ప్రమాదాలు..**

జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా పట్నం రహదారి విస్తరణకు నోచుకోవటంలేదు. హైదరాబాద్ – నాగార్జునసాగర్ రహదారి మీదుగా మంచాల మండల కేంద్రంతో పాటు పాట ఇబ్రహీంపట్నం, బృందావన్‌కాలనీ, కేవీతండాలకు వెళ్లాలంటే.. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తానే ముఖ్యకూడలి. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

**ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి**



ఇబ్రహీంపట్నంలో గత బీఆర్‌ఎస్ హయాంలో ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయిస్తే బాగుండేది. కాని, ట్రాఫిక్ పోలీసులు అవేమి పట్టించుకోవటంలేదు. ఇష్టారీతిన చలాన్లు విధించి వసూళ్లు చేయటంపైనే దృష్టి సారిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

– పాతూరి రాజేశ్‌గౌడ్, వాహనదారుడు

**అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలి**



దుకాణ సముదాయాల ఎదుట అక్రమంగా వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవటంలేదు. స్పందించి అక్రమ పార్కింగ్‌లను తొలగిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

–మహేందర్, స్థానికుడు

**అవగాహన కల్పిస్తాం**



రోడ్లపై వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ముఖ్యంగా ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్లు, రాష్ డ్రైవింగ్ చేసేవారికి అవగాహన కల్పించాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– గురునాయుడు, ట్రాఫిక్ సీఐ ఇబ్రహీంపట్నం

# కులగణనను పారదర్శకంగా చేయాలి

**మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్, మే 1: దేశవ్యాప్తంగా త్వరలో నిర్వహించే జనాభా లెక్కలతో పాటు కులగణనను పారదర్శకంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ లింగయ్యయాదవ్‌తో కలిసి మాట్లాడారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి కులాల వారీగా జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. గత సీఎం కేసీఆర్ విద్యాపరంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలను ఏర్పాటు చేయడంతో పాటు కుల వృత్తులను ఎంతో ప్రోత్సహించారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీలకు 42శాతం ఇస్తామన్నా మాటను చిత్తశుద్ధితో నిలబెట్టుకోవాలన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేశంపేట, మే 1: మండల పరిధిలోని కొత్తపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ పి.అంజిరెడ్డి, పీఏసీఎస్ సీఈవో అనిల్, డైరెక్టర్లు అనితశంకర్, అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సర్పంచుల బృందం పర్యటన



సర్దార్‌నగర్‌లో వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న బీహార్ రాష్ట్ర సర్పంచుల బృందం

షాబాద్, మే 1: షాబాద్ మండలంలోని వివిధ గ్రామాలను బీహార్ రాష్ట్రానికి చెందిన సర్పంచుల బృందం సందర్శించింది. ఎన్‌ఐఆర్‌డీలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర స్థాయి పర్యటనకు గురువారం మండలంలోని సర్దార్‌నగర్, చందనవెల్లి, పోతుగల్, సీతారాంపూర్ గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో గత బీఆర్‌ఎస్ హయాంలో పల్లెప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పల్లెప్రకృతివనాలు, కంపోస్ట్‌యార్డులు, హరితహారంలో నాటిన మొక్కలు, నర్సరీలు, పంచాయతీల్లో అందిస్తున్న పౌరసేవల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అపర్ణ, ఎన్‌ఐఆర్‌డీ కో–ఆర్డినేటర్ విద్యులత, రాజేందర్, అరుణ్, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, అశోక్, విజయ్‌సింహ, మల్లేశ్, పయాజ్, ఆశ్రిత, రవికాంత్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు నర్సింహులు, కొలన్ ప్రభాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.



పది పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన బాటసింగారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు.

– అబ్దుల్లాపూర్‌మెట్, మే 1

## ఎల్ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపునకు గడువు పొడిగింపు

ఆదిబట్ల, మే 1: ప్రభుత్వం ఎల్ఆర్‌ఎస్ ఫీజు చెల్లించడానికి మరో రెండ్రోజులు గడువు పొడిగించిందని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు మే 3 వరకు, అదేవిధంగా ఎర్లీబర్డ్ స్కీం కింద ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీని పొందడానికి మే 7 వరకు గడువు పొడిగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు.

**దరఖాస్తుల స్వీకరణ..**

పట్టణ వీధి విక్రయదారుల కమిటీలో ఐదుగురు అనధికార సభ్యులను కమిటీ మెంబర్లుగా ఎంపిక చేయుటకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 11 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీలో నలుగురు అధికార సభ్యులను కమిషనర్ నామినేట్ చేస్తారు. ఒక బ్యాంకు అధికారిని జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి ఎల్‌డీఎం పట్టణ బ్యాంకుల ప్రతినిధిగా నామినేట్ చేస్తారు. మరొక్క సభ్యుడిని ప్రజాప్రతినిధిగా వ్యక్తులను నియమిస్తారు. మరో ఐదుగురుని అనధికార సభ్యులుగా వివిధ వ్యాపారాలకు చెందిన వీధి విక్రయదారులు రొటేషన్ పద్ధతిపై నలుగురిని, ప్రభుత్వేతర సంస్థ ఎన్జీవో సమాజ ఆధారిత సంఘాల సీబీవో ప్రతినిధిగా ఒక్కరిని రొటేషన్ పద్ధతిపై కమిటిని ఎన్నిక చేస్తామని తెలిపారు.

## ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలి

చేవెళ్లటౌన్, మే 1: చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం 5శాతం రాయితీ కల్పించిందని చేవెళ్ల మున్సిపల్ కమిషన్ పూర్ణచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025–26ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్ పన్ను చెల్లింపుపై సర్కార్ 5శాతం రాయితీ కల్పించిన గడువు ముగియడంతో 7–5–2025 వరకు గడువు పొడిగించిందని తెలిపారు. అదే విధంగా ఎల్ఆర్‌ఎస్ గడువు కూడా 3–5–2025 వరకు పొడిగించినట్లు తెలిపారు.

## బీఆర్‌ఎస్ కార్యకర్త మృతి బాధాకరం

కేశంపేట, మే 1: బీఆర్‌ఎస్ కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటని కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దండె సురేశ్(35) గొల్లూరువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం గ్రామానికి చేరుకొని సురేశ్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్, నాయకులు జమాల్‌ఖాన్, సాజిద్, నరేశ్, పర్వేజ్ పాల్గొన్నారు.

# ఐక్యతతోనే హక్కుల సాధన

**ఘనంగా మేడే దినోత్సవం**
**గ్రామాలు, పట్టణాల్లో కార్మిక జెండా ఎగురవేసిన శ్రమజీవులు**
**పాల్గొన్న పలు కార్మిక సంఘాల నాయకులు**

**ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని** పురస్కరించుకుని కార్మికులు తమ పనులకు సెలవు ప్రకటించి మేడేను ఘనంగా జరుపుకొన్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రంతో పాటు పట్టణాలు, పలు మండలాల్లోని గ్రామాల్లో సీఐటీయూ, ఏఐటీయూసీతో పాటు పలు కార్మిక సంఘాలు, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలు కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యతగా ఉంటూ తమ హక్కులను సాధించుకునే వరకు పోరాటాలు నిర్వహించాలని అన్నారు.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మే 1



షాద్‌నగర్‌లో మేడే కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్, కార్మికులు



పెద్దఅంబర్‌పేటలో..



అబ్దుల్లాపూర్‌మెట్ : జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు యాదిరెడ్డి



ఇబ్రహీంపట్నంలో సీపీఐ జెండా ఎగురవేస్తున్న నాయకులు



చేవెళ్లటౌన్: చేవెళ్లలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆమనగల్లు సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు



ఇబ్రహీంపట్నంలో..



యాచారం మండలం మేడిపల్లిలో సీపీఎం నాయకులు



కడ్తాల్: మండల కేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు



చేవెళ్లలోని ఆలూర్‌లో జెండా ఎగురవేసిన ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సభ్యులు



కేశంపేట: సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్మికులు

## వరి పంటల పరిశీలన

మాడ్గుల,మే1: మండల పరిధిలోని కలకొండ గ్రామంలో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడటంతో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు వరి పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నుంచి నష్టపరిహారం అందేలా సహాయక చర్యలు చేపడుతామని మండల వ్యవసాయ అధికారిని అరుణాకుమారి తెలిపారు. 31 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని, నివేదికను తయారుచేసి జిల్లా అధికారులకు పంపించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలోని విస్తరణ అధికారి భార్గవి, రైతులు పర్వతాలు, రాం రెడ్డి, శేఖర్ రెడ్డి, అరవింద్ తదితరులు ఉన్నారు.



## దాతలు ఆదుకోండి..

**రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయిన రమేశ్**
**భారంగా మారిన కుటుంబ పోషణ**



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న రమేశ్‌ముదిరాజ్

కడ్తాల్, మే 1: రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయిన వ్యక్తికి కుటుంబ పోషణ భారంగా మారింది. కుటుంబ పెద్ద ఇంటి వద్దనే ఉంటుండటంతో ఇల్లు గడవడం కష్టతరమైంది. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన ఎర్గమోని రమేశ్‌ముదిరాజ్ మహేశ్వరం మండలం తుక్కుగూడలోని ఓ రైస్ మిల్లులో ఆపరేటర్‌గా పని చేసేవాడు. 2018 సంవత్సరంలో రైసు మిల్లులో పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా, మార్యమధ్యలో తుమ్మలూరు గేట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేశ్ తీవ్రంగా గాయపడ్డారు. దవాఖానలో చికిత్స పొందిన రమేశ్ తన కాలును కోల్పోయాడు. వైద్యానికి రూ.3 లక్షలపైగా ఖర్చు అయినట్లు రమేశ్ తెలిపాడు. భార్య రజిత చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని రమేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బాధితుడి కుమారులు మనోహర్ 3వ, ప్రణీత్ 2వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. దాతలు ముందుకు వచ్చి తనను ఆదుకోవాలని రమేశ్ ప్రాధేయపడుతున్నాడు. ఆర్థిక సాయం అందించే వారు 88979 42298 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా అందించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

షాబాద్, మే 1: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కొమరబండ, చందనవెల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొలన్ సుధాకర్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



## బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. ఇద్దరు మృతి

కొత్తూరు, మే 1: వేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని వినాయక స్టీల్ నుంచి హెచ్‌బీఎల్ కంపెనీకి వెళ్లే మార్గంలో టిప్పర్ వేగంగా వెళ్లి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న అశోక్ కుమార్, షాహనవాజ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ఆమనగల్లు, మే1: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన దేవమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.32వేల చెక్కును గురువారం ఆమెకు ఆమనగల్లులో ఎమ్మెల్యే నారాయణరెడ్డి తరుపున కేఎన్ఆర్ సేవా దళం అధ్యక్షుడు బాబా అందజేశారు.